# లోక విద్యా ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-8 1 ఏప్రిల్ - 2014 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2

## ఒక రోజు ప్రభువు ఐదేళ్ళ బానిసగా ఉండే వ్యవస్థ స్థానే సామాన్యుడి ప్రభుత్వం రావాలి

ప్రపంచ చరిత్ర చదివిన వారు ఎవరైనా ప్రజాస్వామ్యయుతమైన రోమన్ సామ్రాజ్య పతనాన్ని పరిశీలిస్తే ఈ రోజు భారతదేశంలో అవే పరిస్థితులు గమనించవచ్చు. రోమన్ సెనేటర్లు బహిరంగంగా పండగలలోను, సంతల్లోను, జాతర్లలోను ప్రజల ఓట్లను కొనుగోలు చేసేవారు. దీనికి తోడు రోమన్ పాలకులపై ప్రజలు తిరగబడకుండా ఉండేందుకు ఉచితంగా రొట్టెలు, వినోదానికి మద్యం సరఫరా చేస్తూ, మల్లకత్తియుద్ధాల ద్వారా ప్రజలకు వినోదం పంచేవారు.

కొన్నివేల సంవత్సరాల తర్వాత భారతదేశ ప్రజాతంత్ర వ్యవస్థలో అన్ని కులాల, మతాలవారికి ఇంటింటికి నోట్లు పంపిణీ చేస్తూ ఓట్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రజలకు మీరంతా దారిద్ర్యరేఖకు క్రింద ఉన్నారని తెల్లకార్డులు, ఆరోగ్యశ్రీ మొదలైనవాటితో అమలుకాని హామీలు కూడా వినోదానికి పంచుతున్నారు. అంటే భారతదేశంలో ప్రస్తుత రాజకీయ వ్యవస్థ స్థానే నూతన రాజకీయ వ్యవస్థ నిర్మించబడాల్సిన సమయం ఆసన్నమైందని చరిత్రలో రోమన్ సామ్రాజ్యం పతనమైనట్టు నేటి భారతదేశ రాజకీయ వ్యవస్థ పతనం అంచుకి చేరిందని ఈ దేశ ప్రజలు ముఖ్యంగా ఓటర్లు గమనించాలి.

పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అభివృద్ధి పేరుతో అమలుచేసిన విధానాలవల్ల దేశంలో సహజ వనరులు వెలికితీయటం, సెజ్‌లు, ఓడరేవులు, థర్మల్ కేంద్రాలవల్ల ప్రజల పంటభూములు అన్యాక్రాంతమవడం, భూయజమానులకు నష్టపరిహారం చెల్లించినా భూమిపై ఆధారపడి జీవించే కౌలుదారులు, కూలీలు ఉపాధి కోల్పోవడం చేతివృత్తులవారు తమ ఉత్పత్తులకు మార్కెట్ లేక ప్రత్యామ్నాయ యాంత్రిక ఉత్పత్తులు చౌకధరలతో లభించడంతో ఉపాధి కోల్పోయి వ్యవస్థవైపు నిస్సహాయంగా చూస్తున్నారు. పర్యావరణ సమస్యలతో, ప్రజలు పట్టణ ప్రాంతాలకు వలసపోవటం, గ్యాస్, పెట్రోలు ధరల పెంపు, నిత్యావసర ధరలు పెరుగుదలతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ఆర్థికమాంద్యం పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ప్రతిష్ట కోల్పోయింది.

ప్రతిపక్ష పార్టీ బి.జె.పి. వెనుకబడిన వర్గానికి చెందిన మోడీని ప్రధానమంత్రి అభ్యర్థిగా ముందుపెట్టి వివిధ వర్గాలను కలుపుకుంటూ తామే అధికారంలోనికి రాబోతున్నామని అంబాని, ఆదానీల అండతో మీడియా అంతా తానై ప్రచారంలో దూసుకుపోతున్నాడు. ప్రాంతీయ పార్టీలైన సమాజ్‌వాది, అన్నా డి.ఎం.కె. త్రుణమూల్ కాంగ్రెస్, తెలుగుదేశం, బి.ఎస్.పి. తదితరులు తమ ఉనికిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

మన రాష్ట్రంలో విభజన నేపథ్యంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో వివిధ పార్టీల నుండి వస్తున్న నాయకుల వలసలతో తెలుగుదేశం, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్, తెలంగాణా రాష్ట్రసమితి బరిలో నిలిచాయి. బి.సిని ముఖ్యమంత్రిని చేస్తామని ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి ఒరవడిలోనే మరింత వేగంగా రాష్ట్రాన్ని సింగపూర్‌తో సమానంగా అభివృద్ధి చేస్తామని, సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తామని వాగ్ధానాలు చేస్తున్నారు.

దేశంలో ప్రజాస్వామ్య భావన ఇంగ్లాండ్ నుండో, అమెరికా నుండో వచ్చిందని మేధావులు ప్రచారం చేసారు. కాని గత చరిత్రలోకి వెళితే గౌతమబుద్ధుని కాలంలో గణతంత్ర వ్యవస్థ ఉనికిలో ఉండేది. ఈనాడు అమలులో ఉన్న ప్రజాస్వామ్యం కన్నా అది ఎంతో శక్తివంతమైంది. రాజులు ప్రజల నుండి ఎన్నిక కాకున్నా గ్రామసభల అభిప్రాయాలను రాజులు ఆమోదించి అమలుచేసేవారు.

ఈనాడు 5ఏళ్ళకోసారి ఎన్నికలు జరిగినా ప్రజాప్రతినిధులు, నాయకులు మారి ప్రజల కన్నా శక్తిమంతులుగా రూపొందారు. రాష్ట్రపతి భవనం 340 ఎకరాలలో విస్తరించింది. ప్రధానమంత్రి, మంత్రులకు అధికారులకు ఖరీదైన విలాసమైన భవనాల్లో నివసిస్తున్నారు. ప్రభుత్వాధికార్లకిచ్చే బంగ్లాలు ప్రతీ జిల్లా కేంద్రంలో మనం చూస్తున్నాం. మరోకప్రక్కన పేదప్రజలు మురికివాడలలో దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారు.

బ్రిటీష్ గవర్నర్ జనరల్ లార్డ్ మెట్ కాఫ్ 1830లో భారతదేశం యొక్క పునాది గ్రామాల్లోని గ్రామసభలో ఉందని, గ్రామంలోని ముఖ్యకూడలిలో ప్రజలు సమావేశమై, చర్చించి సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటారనీ దీనిని రద్దుచేయకుండా బ్రిటీష్ అధికారాన్ని భారతదేశంలో స్థాపించడం సాధ్యం కాదని బ్రిటీష్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాడు. 1860లో బ్రిటీష్ ప్రభుత్వం ఒక చట్టం ద్వారా గ్రామసభలను రద్దుచేసి కలెక్టర్ రాజ్యంను తెచ్చారు. ప్రజల అధికారాన్ని, హక్కులను తొలగించి కలెక్టర్‌కు సర్వహక్కులు కట్టబెట్టారు.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా గ్రామ ప్రజలకు అధికారం రాలేదు. బ్రిటీష్ కలెక్టర్ స్థానంలో భారతీయ కలెక్టర్‌ను నియమించారు. అదే అధికారం, అహంకారం కొనసాగింది. ఎంతవరకైతే గ్రామసభల్లో ప్రజలకు నిర్ణయాధికారం లభించదో ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్య లభించినట్లు కాదు.

**పంచాయితీరాజ్ వ్యవస్థలో లోపాలు** : పంచాయితీరాజ్ వ్యవస్థలో అధికారం, హక్కులు ప్రజల చేతులో కాకుండా రాజకీయ నాయకులు, అధికారుల చేతిలో కేంద్రీకృతం అయింది. సంక్షేమ పథకాలన్నీ కేంద్రం, రాజధానుల్లో రూపొందుతున్నాయి. పంచాయితీల్లో దీన్ని అమలుపరచడం మాత్రమే తప్ప వేరే మార్పులు చేయలేరు.

1) పంచాయితీలకు పరిమితమైన హక్కులు, అధికారాలు ఉన్నాయి. ప్రభుత్వ నిధులపై, ప్రభుత్వ అధికారులపై నియంత్రణ పంచాయితీలకు లేదు.

2) ఏవైతే కొద్ది అధికారాలు ఉన్నాయో అవి సర్పంచ్‌కి మాత్రమే ఉన్నాయి. గ్రామసభలకు కనీసం వ్యతిరేకించే హక్కు కూడా లేదు. గ్రామసభలో సలహా ఇచ్చినా సర్పంచ్ అంగీకరించటం లేదా తిరస్కరించటం చేయవచ్చు. సర్పంచ్ అవినీతి పరుడైతే తొలగించే అధికారం ప్రజలకు లేదు.

3) జిల్లా కలెక్టర్ మాత్రమే సర్పంచ్‌పై చర్య తీసుకునే అధికారం ఉన్నది. కలెక్టర్‌కు మాత్రమే అన్ని అధికారాలున్నాయి.

సర్పంచ్ అవినీతి పరుడైతే గ్రామ ప్రజలకు తొలగించే అధికారం ఉండాలి. అవినీతి పరులైన కలెక్టర్, రాజకీయ నాయకులు కలెక్టర్ ద్వారా సర్పంచ్‌లను అదుపుచేస్తున్నారు. గ్రామసభలకు పూర్తి అధికారాలున్నప్పుడే అవినీతిపరుడైన సర్పంచ్ ఎం.పి.డి.ఓలను తొలగించి కలెక్టర్‌ను, రాజకీయనాయకులను ఎదిరించి నిలబడగలుగుతారు.

**ఇతర దేశాలలో :**

అమెరికాలోని వివిధ పట్టణాల్లో స్థానిక ప్రజల ఆమోదం లేకుండా నిర్ణయాలు జరగవు. ఓరెగాన్ పట్టణంలో వాల్‌మార్ట్ సంస్థ దుకాణం ఏర్పాటు కొరకు స్థానికులైన ప్రజలకు నోటీసు ఇచ్చారు. స్థానికులంతా సమావేశమై వాల్‌మార్ట్ షాపువల్ల చిన్నచిన్న దుకాణదారులు దెబ్బతిని ఉపాధి కోల్పోతారు కనుక దీన్ని అంగీకరించలేమని ఏకగ్రీవంగా వ్యతిరేకించటంతో వాల్‌మార్ట్ దుకాణాన్ని ప్రారంభించలేక పోయింది.

అదే వాల్‌మార్ట్ కంపెనీ భారతదేశంలో ప్రవేశించేందుకు అనుమతి కోరగా ఇద్దరు వ్యక్తులు భారతదేశ వాణిజ్య మంత్రి, ప్రధానమంత్రి వెంటనే ఆమోదించారు. వాల్‌మార్ట్ వల్ల చిన్న దుకాణాదారులు నష్టపోయినా, ఉపాధి కోల్పోయినా ప్రజల ఆమోదం పొందాలనే ఆలోచన ఇక్కడ పాలకులు చేయలేదు.

బ్రెజిల్‌లో చిన్న పట్టణంలో ఫోర్ట్ అగ్రెలేలో 40 శాతం జనాభా మురికివాడల్లో నివసిస్తారు. ఇక్కడ రోడ్లు లేవు. మురికినీటి సౌకర్యం, త్రాగునీరు, పిల్లలకు స్కూలువంటి కనీస సౌకర్యాలు లేవు. 1990లో వర్కర్స్ పార్టీ ఎన్నికల్లో గెలిచి వారి కనీస అవసరాలైన రోడ్లు, స్కూళ్ళు, త్రాగునీరు వంటి వాటికొరకు ప్రజల సమక్షంలోనే బడ్జెట్ రూపొందించి, స్థానిక సంస్థలకు బడ్జెట్ కేటాయించి వారిద్వారానే ప్రాధాన్యతా క్రమంలో అమలుచేశారు. ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో గత 15 సంవత్సరాలుగా ఎన్నికల్లో ఓడిపోకుండా వర్కర్స్ పార్టీ గెలవటానికి వారి కనీస అవసరాలను వారి ప్రాధాన్యతా క్రమంలో తీర్చడంవలనే అని పేర్కొన్నది.

స్విట్జర్లాండ్‌లో అమలుజరుగుతున్న ప్రజాస్వామ్య ప్రక్రియ ప్రపంచంలోనే అత్యున్నతమైనదిగా భావిస్తారు. 50వేల మంది సంతకాలు చేసి ప్రభుత్వానికి అందజేస్తే ప్రభుత్వం పార్లమెంటులో వెంటనే బిల్లు ప్రవేశపెడుతుంది. 10వేల మంది చట్టంలో మార్పులు కోరుతూ సంతకాలతో మెమోరాండం ఇస్తే ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు బిల్లు ప్రవేశపెడుతుంది. రాజ్యాంగంపై దాని అమలు ప్రక్రియపై ప్రజలకున్న అధికారాన్ని ఇది తెలియజేస్తుంది. అదే మనదేశంలో 50 వేల మంది సంతకం చేసి కోర్కెల పత్రం ఇస్తే ప్రభుత్వం కనీసం అందినట్లుగా రశీదు కూడా ఇవ్వదు. గ్రామంలోని ప్రజలంతా కలిసి అవినీతిపరుడైన సర్పంచ్‌ని మార్చి కొత్తవారిని ఎన్నుకొనే హక్కు ప్రజలకు లేదు. ఏ సర్పంచ్‌నైనా పదవి నుండి తొలగించే సర్వహక్కులు కలెక్టర్‌కే ఉన్నవి. అందుకే ఎన్నికైన సర్పంచ్ తాము ఎన్నుకున్న ప్రజలకు బదులు జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర అధికార పార్టీకి జవాబుదారిగా వ్యవహరిస్తున్నారు.

**గ్రామసభల ఆధ్వర్యంలో ప్రభుత్వోద్యోగులు :**

గ్రామ సభలకు స్కూలుకు సక్రమంగా హాజరుకాని/పాఠాలు సరిగ్గా చెప్పని ఉపాధ్యాయులకి జీతం ఇవ్వకుండా నిలిపివేసే అధికారం ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సక్రమంగా చికిత్స అందించకపోతే డాక్టర్ జీతం నిలిపివేయాలి. చౌకధరల దుకాణంలో నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోతే రేషన్‌షాప్ లైసెన్స్‌ను రద్దుచేసే అధికారం గ్రామసభలకు ఉండాలి. పోలీసు స్టేషన్‌లో అధికారి కేసును రిజిష్టర్ చేయకుండా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే గ్రామ సభకు పోలీసు అధికారి జీతం ఇవ్వకుండా నిలిపివేసే అధికారం ఉండాలి. స్కూల్లో, ఆస్పత్రుల్లో ఖాళీగా ఉండే పోస్టుల్లో ఉపాధ్యాయులను, డాక్టర్లను నియమించే/సరిగ్గా పనిచేయలేకపోతే తొలగించే అధికారం గ్రామసభలకు ఉంటే గ్రామాలు అభివృద్ధి అవుతాయి. గ్రామసభలకు ఎం.పి.డి.ఓ/

ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా హాజరై గ్రామసభల నిర్ణయాలు అమలుచేయాలి. ఏ అధికారైన గ్రామసభలకు రమ్మని ఆదేశిస్తే హాజరుకాని అధికారిని, శిక్షించే అధికారం ప్రజలకు ఉండాలి. సక్రమంగా తమ విధులను నిర్వర్తించే అధికారులు, పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, విధి నిర్వహించే డాక్టర్లు మొదలైనవారు అవినీతిపరులైన జిల్లా యంత్రాంగం, రాష్ట్రస్థాయి రాజకీయ పార్టీలకు అడుగులకు మడుగులొత్తకపోతే, ఏదో ఒక చిన్న విషయంలో విధి సక్రమంగా నిర్వర్తించటంలేదని, లేదా ఉద్యోగేతర రాజకీయ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారని క్రమశిక్షణ చర్యల పేరుతో అనేకమంది నిజాయితీపరులైన ప్రభుత్వోద్యోగులను మెమోలతో, సస్పెన్షన్‌లతో, చార్జ్‌షీట్‌లతో, బదిలీలతో, ఎటువంటి పోస్టింగ్ ఇవ్వకుండా వేధించడం మనంమంతా చూస్తున్నాం. కోర్టుల్లో న్యాయంకోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న ఉద్యోగులు లక్షలు. మనదేశంలో న్యాయస్థానాలలో కేసులెలా ఉన్నాయంటే పూర్వపు సామెత గుర్తుకోస్తుంది. "కాశీకి వెళ్ళినవాడు, కాటికి వెళ్ళినవాడు సమానమే" అనేది. ఈ రోజు పేదవాడి కేసుకు 30-40 కొన్నిసార్లు 50 సం॥రాలు పడతాయి. అదే డబ్బున్న వారికి త్వరితగతిన న్యాయం జరుగటం చూస్తున్నాం. కోర్టులు కూడా కౌంటర్లు వెయ్యని, చార్జిషీట్లు వెయ్యని అధికారులను, పోలీసులను ఈ రోజుదాకా శిక్షించిన దాఖలాలు లేవనే చెప్పాలి. సామాన్యులు ప్రభుత్వ కార్యాలయాలకు విచారణ నిమిత్తమై, పని నిమిత్తం వెళితే వారిని పురుగులకంటే హీనంగా చేస్తూ అవినీతిపరులను అందలాలు ఎక్కిస్తూ, వారి పనులను చేస్తూ ఉండటం ఎన్ని పార్టీలు మారినా ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితి మారకపోవడం మనం చూస్తున్నాం.

దేశంలో పేదలు, అడుక్కునేవారితోసహా అందరూ తమకు కావాల్సిన టూత్‌పేస్ట్, బ్రష్, బట్టలు, కాగితం, పెన్సిలు, సబ్బులు కొనడం ద్వారా ఎక్సైజ్ పన్ను/సేల్స్‌టాక్స్ కడుతున్నారు. స్టాంప్ డ్యూటీ, సర్వీస్‌టాక్స్, కస్టమ్స్ టాక్స్, వ్యాట్ పేరుతో మనం ప్రభుత్వానికి లక్షకోట్లుపైగా పన్ను కడుతున్నాం.

ప్రభుత్వ లెక్కల ప్రకారం జనాభాలో 70శాతం ప్రజలు రోజుకి 20రూపాయల చొప్పున ఆదాయం పొందుతున్నారు. ఐదుగురు సభ్యుల కుటుంబం నెలకు 3000 వేల రూపాయలు సంపాదిస్తుంటే 10శాతం పన్ను కింద నెలకు 300 రూపాయలు, సంవత్సరానికి 3600 రూపాయలు పన్నురూపంలో కడుతున్నారు. ఒక గ్రామంలో 1000 కుటుంబాలుంటే 36లక్షల రూపాయలు పన్నుపేరుతో ఆ గ్రామం కడుతుంది. ప్రభుత్వం పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం నుండి ప్రభుత్వ ఉద్యోగులకు, బ్యూరాక్రట్లకు, రాజకీయ నాయకులకు వేతనాల రూపంలో చెల్లిస్తున్నారు. ప్రజల డబ్బుతో బంగ్లాలు, ఎ.సీలు, కార్లు, పెట్రోలు వంటి సౌకర్యాలు అధికారులు పొందుతున్నారు. స్కూల్లో ఉపాధ్యాయుడు, ఆస్పత్రిలో డాక్టర్లు, రేషన్‌షాపు డీలర్, చివరకు కలెక్టర్ ఆఫీసులో కలెక్టర్, అతనికింద పనిచేసే బంట్రోతు కూడా మనం కట్టే పన్ను మీద బ్రతుకుతూ కనీసం ప్రజలంటే వారికి గౌరవం ఉండదు.

గ్రామాల్లో ప్రభుత్వం వివిధ పథకాలకింద డబ్బు ఖర్చుపెడుతోంది. ఈ పథకాలు, పాలసీలు దేశ రాజధానిలో, ఏ.సీ గదుల్లో బ్యూరాక్రట్లు ప్రజల అవసరాలతో సంబంధంలేకుండా రూపొందిస్తున్నారు. వృద్ధాప్యం పింఛన్, వితంతు పింఛను, పి.డి.ఎస్., ఇందిరా వికాస్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం మొదలగునవి.

గ్రామాల్లో ప్రజలకు ఈ పథకాలు కన్నా ముఖ్యమైన అవసరాలు వేరే ఉన్నవి. పథకాలకు తప్ప ఈ అవసరాలకు వేరే నిధులుండవు. అందుకు వారికిస్తున్న మొత్తాన్ని పథకాల రూపంలో కాకుండా డబ్బురూపంలో ఇవ్వాలి. ప్రజలు గ్రామసభలో వారి అవసరాలు ఎమిటి అని చర్చించి ఎంతమొత్తం వృద్దులకు, వితంతువులకు, ఇండ్లనిర్మాణాలకు, విద్య, వైద్య అవసరాలను బట్టి వినియోగిస్తారు. ఎంత డబ్బు ఉన్నా రైతులు ఆత్మహత్యలు, త్రాగునీరు, వైద్య సౌకర్యాలకు ఖర్చుచేయకుండా ఉంటే ఏమి లాభం? డబ్బుకన్నా ప్రాణం ముఖ్యంకాదా? నిబంధనల పేరుతో, పథకాల పేరుతో విచ్చలవిడిగా అవకతవకలకు అధికారులు పాల్పడుతుంటే, ప్రజలు ఫిర్యాదు చేసినా ఏళ్ళ తరబడి అవినీతి పరులకు రక్షణ కల్గిస్తున్నారు. గ్రామసభలకు స్వేచ్ఛగా నిర్ణయాలు చేసే అధికారం ఉన్నప్పుడు డబ్బురూపంలో ఇస్తే అవసరాన్ని బట్టి వినియోగించి రైతులకు, ప్రజలకు తక్షణ ప్రయోజనం కలుగుతుంది. అధిక వడ్డీల భారినపడే ప్రజలకు తక్కువ వడ్డీకి, లేదా వడ్డీ లేకుండా రుణాలు ఇవ్వగలుగుతారు. రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చు. అన్ని రకాల పథకాల అమల్లో 10శాతం మాత్రమే ప్రజలకు చేరుతుందని సర్వేలు చెబుతున్నప్పుడు గ్రామసభలు 90శాతం దుర్వినియోగాన్ని కన్నంలో దొంగను పట్టుకొని శిక్షించి ప్రజలకు తక్షణం సహాయం అందించగలుగుతారు. మన రాష్ట్రంలో కోటి 70 లక్షల తెల్లకార్డులున్నాయని ఒక కార్డుకు 5గురు చొప్పున మొత్తం రాష్ట్ర జనాభా అంతా దరిద్రులేనని మన పౌరసరఫరా శాఖ ఒక ప్రక్క ప్రకటించడం, రచ్చబండ, ప్రజల వద్దకు పాలనలో ఇంకా లక్షలమంది తెల్లకార్డులు కావాలని విజ్ఞప్తులు అందటం, ఓట్లకోసం అందరికి తెల్లకార్డు, ఆరోగ్యశ్రీ, వితంతు ఫించన్, వృద్ధాప్య ఫించన్ ఇవ్వడంతో పేదప్రజలకు మాత్రమే అందవలసిన సొమ్ము ఇతరులకు అందుతోంది. అనేక రేషన్‌కార్డులు ఒక డీలర్ దగ్గర లేదా ఒకే కుటుంబంలో ఉన్నాయంటే ఆ పేద ప్రజల నిధులను వీరు కొల్లగొట్టి పేదప్రజల పొట్టలు కొడుతున్నారన్నమాట. అర్హులను ఆదుకోవటం ఎంత అవసరమో, అనర్హులకు సంక్షేమ పథకాలు ఆపడం అంతే అవసరం. దీనిద్వారా వేల కోట్లు అభివృద్ధి కార్యక్రమాలకు మళ్ళించవచ్చు.

సర్పంచ్ ఎంత మంచివాడైనా గ్రామసభల్లో చర్చించి సమిష్టి నిర్ణయం ప్రకారం పనిచేసినప్పుడు ప్రజలకు న్యాయం జరుగుతుంది. వివిధ పథకాల కింద కేటాయిస్తున్న మొత్తాలు డబ్బు రూపంలో గ్రామపంచాయితీకి ఇస్తే, గ్రామసభ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎం.పి.టి.సిలు, జెట్.పి.టి.సిలు స్వేచ్ఛగా పనిచేసి ప్రభుత్వ ఉద్యోగులను గ్రామసభ ఆధ్వర్యంలో పర్యవేక్షించి ప్రజలకు సేవ చేయగలుగుతారు. కలెక్టర్ రాజకీయ నాయకులను ఎదిరించి ప్రజలకు అనుకూలంగా చేయగలుగుతారు. గ్రామసభలకు అత్యున్నత అధికారాలు, నిధులు ఇచ్చినప్పుడు ప్రజల నుంచి మహానాయకులు ఉద్భవిస్తారు.

గ్రామ సభల్లో గ్రామంలో జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమం చర్చించటం వల్ల ప్రజలందరికి అవినీతిని నిర్మూలించడానికి అవకాశం దొరుకుతుంది. భూగర్భజలాలు అంతరిస్తున్న చోట వాటర్‌షెడ్ పథకాలు, ముంపు ప్రాంతాల్లో డ్రైనేజ్ వ్యవస్థ నిర్మించాల్సి ఉండగా ప్రభుత్వం రెండుచోట్ల ఈ పనులకై సొమ్ము వెచ్చించటంతో కనీసం ఒక పథకానికి ఖర్చు అవుతున్నాయని చెప్పబడుతున్న నిధులు, అధికారులు, రాజకీయ నాయకులు పంచుకుంటున్నారు.

స్థానిక వనరులైన ఇసుకతోసహా ఇతర ఖనిజాలను స్థానిక ప్రజలు ఒక పద్ధతిగా పర్యావరణాన్ని రక్షించుకుంటూ ఆయా అవసరాలకు మాత్రమే వినియోగిస్తూ వ్యాపార దృష్టి లేకుండా అడవుల్ని, నదుల్ని, భూగర్భ జలాల్ని తరతరాలుగా కాపాడేవారు. ఈనాడు వీటికి లైసెన్సు మంజూరు పేరుతో కలెక్టర్ గారే ప్రతీ జిల్లాలోనూ ప్రకృతి విధ్వంసానికి నాయకత్వం వహిస్తున్నారు. సహజసంపద అంటే గాలి, నీరు, భూమి, గనులు, శబ్దతరంగాలు, భూగర్భంలోని పెట్రోలు, సహజవాయువు మొదలగునవన్ని. వీటిమీద అధికారం గ్రామస్థులనుండి తీసేసి కలెక్టర్లకు కట్టబెట్టడం వల్ల ఎన్నడూలేనంతగా భారతదేశంలో దరిద్రుల సంఖ్యతో పాటు, కోటీశ్వరుల సంఖ్య అత్యంత వేగంగా పెరుగుతోంది. 17 సంవత్సరాల వరకు 2.38 డాలర్లకు రిలయన్స్ వారు గ్యాస్ ఇవ్వాల్సి ఉండగా ప్రతి రెండు, మూడు సంవత్సరాల గ్యాస్ ధర పెంచుకుంటూ పోయి ఒకప్రక్క ప్రజలు ధరల భారం మోయలేకపోతుంటే మరొక ప్రక్క గ్యాస్ కంపెనీ అధిపతులు అపరకుబేరులవుతున్నారు.

ఇనుప ఖనిజంను 30 రూపాయలకు టన్ను చొప్పున ప్రభుత్వానికి చెల్లించి అంతర్జాతీయ విపణిలో 3500 రూపాలకు అమ్ముకోవడం ఇనుపగనుల యజమానులు, బొగ్గగనుల యజమానులు, ప్రైవేట్ విద్యుత్ సంస్థ యజమానులు అనూహ్యంగా సంపద పోగేసుకుంటున్నారు. స్వేచ్ఛా విపణిలో లక్ష 76వేల కోట్ల రూపాయలు శబ్దతరంగాలకు వస్తుంటే, దాని నామమాత్రంగా కొద్ది మొబైల్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టి ఆశ్రిత పెట్టుబడిదారుల్ని కోటీశ్వరులుగా తయారుచేస్తున్నారు. ఈనాడు వేమన్న ఊహించిన పద్ధతిలో నీళ్ళు కొనుకొంటున్నాం, పాలుకొనుక్కొంటున్నాం, ఇతర ఉత్పత్తులను కొనుక్కొంటున్నాం, ఆఖరికి కలుషితమైన గాలివల్ల అనారోగ్యం భారిన పడినవారంతా గాలిని కూడా కొనుక్కొంటున్నాం. ఈనాడు ప్రభుత్వ పాలన అంటే లాభాలతో నడిచే కోటీశ్వరులను తయారుచేసే ఒక వ్యవస్థ. దీని స్థానే గ్రామసభల ద్వారా పట్టణ వార్డు సభల ద్వారా, పౌర సంక్షేమం సంఘాల ద్వారా పన్నుల డబ్బులన్నీ స్థానిక అవసరాల మేరకు ప్రజల ఆధ్వర్యంలో ఖర్చుపెట్టే నూతన సమాజ నిర్మాణం ప్రతి సామాన్యుడి బాధ్యత.

**చట్టాలు విధానాలు రూపొందించడంలో ప్రజల భాగస్వామ్యం**

మనచట్టాలతోటి ఎన్నికయిన శాసనసభ్యుడు కానీ, పార్లమెంటు సభ్యుడుకానీ మన గురించి ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. కాని ప్రజల నుండి ఎన్నికయిన ఎం.ఎల్.ఎలు, ఎం.పిలు ఈ పనిచేయడంలేదు. కాంగ్రెస్, బి.జె.పి. లేదా మరో పార్టీల అధినాయకత్వాలు విప్ జారీచేసి పూర్తిస్థాయిలో చర్చలు జరపకుండా బడా కంపెనీలకు అనుకూలంగా విధానాలు రూపొందించడం జరుగుతోంది. పార్టీల అధిష్టానం యొక్క ఆదిపత్యం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమైనది. విధానాల రూపకల్పనలో ప్రజలను గ్రామసభలో భాగస్వాములను చేయకుండా రూపొందించిన వాటిని తక్షణం రద్దుచేసి, విదేశీ కంపెనీలు, బడాపారిశ్రామికవేత్తల కనుకూలంగా చేసిన విధానాలను తిరస్కరించే హక్కు ప్రజలకుందని, పార్టీల అధిష్టానాల సంస్కృతిని ఎట్టి పరిస్థితులలో అనుమతించరాదని ఓటేద్దాం.

**పార్టీ ఫిరాయింపులు - ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం :**

అభివృద్ధి చెందిన దేశాలలో పార్టీ ఫిరాయింపులునేవి ఎక్కడా లేవు. ఆయా పార్టీల విధానాలపై విభేదించడం, చర్చించడం చేస్తారు. కానీ మనదేశంలో లాగా పెద్ద ఎత్తున పార్టీలు ఫిరాయించరు. నిన్నటిదాకా మంత్రులుగా అధికారం వెలగబెట్టి ప్రజల వ్యతిరేకత ఎదుర్కొన్న నాయకులు ఎన్నికల వేళ పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయించడంలో విధానపరంగా విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి చిత్తశుద్ధి ఏమాత్రం లేదు. ఏరకంగానయినా అధికారంలోకి రావడమే వారి ఆలోచనగా వుంది. ఇటువంటి పార్టీ ఫిరాయింపులు చేసిన నాయకులకు ప్రజలు ఏ పార్టీకి ఓటు చేయకుండా 'నోటా' పై తమ ఓటువేసి బుద్ధి చెప్పాలని మరల ఇటువంటి ఫిరాయింపులు ప్రోత్సహిస్తే తమకు పుట్టగతులుండవని ఆ పార్టీలను హెచ్చరించాలి.

**సహజ వనరులు పై హక్కు స్థానిక సమాజాలదే**

దేశంలో భూతలంపై, భూగర్భంలో వున్న సహజవనరులు నీరు, గాలి, వాయువు, ఖనిజాలపై ప్రజలందరికి చెందినవి. సమాజ అభివృద్ధికి అనుకూలంగా వినియోగించాల్సిన వీటిపై విదేశీ లేదా స్వదేశీ కంపెనీలకు ధారాదత్తం చేసే హక్కు అధికారంలో వుండే ప్రభుత్వాలకు లేదు. ఆ గ్రామంలో ఉన్న ప్రజలు మాత్రమే నిర్ణయించాలి.

ఏ కంపెనీ అయినా ఆయా ప్రాంతాలలో వుండే స్థానిక గ్రామసభలకు, నగరంలో పౌర కమిటీలకు అనుమతికొరకు దరఖాస్తు చేయాలి. ప్రజలు స్థానిక గ్రామ/పౌర సభలలో విస్తృతంగా చర్చించి ప్రజల ఆమోదించిన మేరకు మన పర్యావరణం, సహజ వనరులకు నష్టం జరగకుండా వుండే విధంగా అనుమతించిన మేరకు మాత్రమే సహజవనరలు వెలికితీసి ప్రజలకు ఉపయోగకరంగా వినియోగించాలి. కృష్ణా బేసిన్‌లో గ్యాస్ వెలికితీసే హక్కు రిలయన్స్ కంపెనీకి ఇవ్వడం, వెలికితీసిన గ్యాస్ ధరను 3, 4 రెట్లు పెంచి వేసి కోట్లాదిరూపాయలు దండుకునే అక్రమ విధానాలను రద్దుచేసి, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సహజ వనరులను వెలికితీసి స్థానిక సమాజాలకు లాభంకలిగే విధంగా ధరల్ని 75% తగ్గించాలి.

సహజ వనరుల పై ప్రజల హక్కుకు విరుద్ధంగా జరిగే విధానాలను ఎట్టి పరిస్థితులలోనూ అనుమతించ కూడదు. చట్టవిరుద్ధంగా వ్యవహరించే పాలకులను ప్రజలు గ్రామసభల ద్వారా కట్టడి చేయాలి.

**ఎన్నికలు - ప్రణాళికలు - ప్రజలు**

ప్రతి సంవత్సరం మనకు వానాకాలం, శీతాకాలం, వేసవికాలం వస్తాయి. ఆ వాతావరణాన్ని మనం ఏవిధంగా మన అభివృద్ధికోసం ఉపయోగించుకోవాలో ప్రతీ జీవి మానవుడితో సహా ప్రణాళికలు వేస్తాయి. ఈ ప్రణాళిక ఆచరణలో వచ్చిన వడిదుడుకులను అధిగమించే జీవులన్ని అభివృద్ధి చెందుతాయి. తట్టుకోలేనివి అంతరించిపోతాయి.

మనకు 5 ఏళ్ళకోసారి ఎన్నికలు వస్తాయి. స్థానిక పంచాయితీ, మున్సిపాల్టీలకు మండల జిల్లా పరిషత్‌లకు, శాసనసభతో పాటు పార్లమెంటుకు ఒకేసారి ఎన్నికల కాలం వచ్చేసింది. అనేకమంది వారు సాధించిన అభివృద్ధిని కీర్తిస్తూ అంతరించిపోయిన, అంతరిస్తున్న జీవులనన్నిటిని ఎగతాళి చేస్తూ మళ్ళీ ప్రణాళికలతో మన ముందుకొస్తున్నారు. ఒకరు రాష్ట్ర విభజనను అడ్డుకుంటామంటే మరొకరు విముక్తి చెందిన ప్రాంతాన్ని స్వర్గంగా మారుస్తామంటుంటే, మూడవవారు హైదరాబాద్, సింగపూర్ లాంటి పట్టణాలను నిర్మించి అభివృద్ధి సాధిస్తామంటుంటే ఇంకొకరు వాషింగ్టన్, న్యూయార్క్‌లను మన రాష్ట్రానికి దిగుమతి చేస్తామనే ప్రణాళికలతో మన ముందున్నారు.

గత అభివృద్ధి క్రమంలో ఈ పార్టీలన్నీ చేసిన అభివృద్ధిలో మునిగిపోయిన, ఊపిరాడక చచ్చిపోయిన, చచ్చిపోతున్న ప్రజలు తమ ప్రణాళికలు అభ్యర్థుల ముందుపెట్టి పై పార్టీలన్నింటిని ఊపిరాడకుండా చెయ్యాల్సిన అవసరం ఎన్నడూ లేనంతగా ఈ రోజు మనముందున్న సంగతి లోకవిద్య ప్రపంచం ప్రజల ముందుకు తెస్తోంది.

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి సామాన్య ప్రజలనే ఎలా బహిష్కరిస్తోందో విశ్లేషిస్తే ప్రజల ప్రణాళికలు ఏమిటో ప్రజలే నిర్ణయించుకోగలుగుతారు. ప్రతీ ప్రాణికి పుట్టినప్పటి నుంచి చచ్చేదాకా కావాల్సినవి పీల్చడానికి పరిశుభ్రమైన గాలి, త్రాగడానికి మంచినీరు, తినడానికి తిండి, వుండడానికి ఇల్లు, అవసరానికి వైద్యం, జ్ఞానంకోసం చదువు, ఆహ్లాదంకోసం ఆట స్థలాలు, గ్రంథాలయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇవ్వన్నీ కూడా కొద్దో గొప్పో తేడాతో తరతరాలుగా మన రాష్ట్రంలో అందరికీ కొద్దిగా అటుఇటుగా దొరికేవి. దీనికి ప్రధాన కారణం పల్లెలు, పంటపొలాలు, పాడిపశువులు, చెట్లు, చేమలు, ప్రతీ గ్రామంలోనూ పంటచెరువు, త్రాగునీటి చెరువు, ఒకబడి, ఒక ఆర్.ఎం.పి. డాక్టర్, దేవాలయం, రచ్చబండ, ప్రతీ గ్రామంలోనూ వుండేవి. ఈనాడు ఉదయం లేచిన వెంటనే ప్లాస్టిక్ ప్యాకెట్లలో పాలు, ప్లాస్టిక్ ప్యాకెట్లలో నీళ్ళు, ప్లాస్టిక్ సంచుల్లో కూరలు, ప్లాస్టిక్ సంచుల్లో తినుబండారాలు, ఈ ప్లాస్టిక్‌తో లక్షలమందికి ఉపాధికల్పించే అడ్డాకులు సేకరించే గిరిజనులు, తాటాకు వెదురు బుట్టలుఅల్లే మేదర్లు ఉపాధి కోల్పోయారు. ఇక కూరలు, పండ్లు, పాలు, వండిన పదార్థాలు దాచుకోవడానికి ఫ్రిజ్‌లు, పెద్దఎత్తున వంటల్లో వాడే స్టీలు పాత్రలు, మార్కెట్లో ప్రవేశించి లక్షలాది మంది కుమ్మరులు ఉపాధి ఉద్యోగం కోల్పోయారు. విచ్చలవిడిగా వచ్చిన ప్లాస్టిక్ వస్తువులు, కుక్కర్లు, నాన్‌స్టిక్ పాత్రలు కమ్మరులందరిని నిరుద్యోగులుగా చేసాయి. నైలాన్ వలలు, ట్రాలర్లు, మరబోట్లు వచ్చి చేప విత్తనాలతో సహ సముద్ర తీరానికి 30, 40 కి.మీ. వరకు వున్న మత్స్య జలసంపదను అంతర్జాతీయ మార్కెట్‌కు తరలించడంతోపాటు సముద్రంలోకి, నీటి వనరులలోకి వదిలే వ్యర్థ పదార్థాలవల్ల, థర్మల్ విద్యుత్ పరిశ్రమల నుండి వచ్చే బూడిదవల్ల, పరిశ్రమలనుండి వచ్చే రసాయనిక వ్యర్థాలు లక్షలాది మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. పట్టణాలకు, పరిశ్రమలకు ఎగుమతి చేసే వస్తువుల తయారికీ పెద్ద ఎత్తున గనుల తవ్వకాలుతో భవన నిర్మాణాలతో గ్రామీణ ప్రాంతంలో ఇసుక పూర్తిగానూ, కొండ, అడవి ప్రాంతాలనుండి ఖనిజాలు, కలప పూర్తిగానూ, భూగర్భం నుండి సహజవాయువు, పెట్రోలియం ఉత్పత్తులు విచ్చలవిడిగా కొల్లగొట్టడంతో వాతావరణంలో పెనుమార్పులు, భూగర్భజలాలు అడుగంటడం, వర్షాకాలం ఎండలు, శీతాకాలం వానలు, వేసవి కాలం చలిగాలులతో ప్రకృతి తన ప్రకోపాన్ని చూపిస్తోంది. కారీ పాక్‌లతో పాటే క్యాన్సర్‌వ్యాధి భయంకరంగా వ్యాపిస్తోంది.

హరిత విప్లవం పేరుతో విచ్చలవిడిగా వాడిన ఎరువులు, రసాయనిక మందులు, అధికనీటి వాడకంతో భూమిలోని సమస్త జీవులు నశించడమే గాక, భూగర్భ జలాలు కలుషితమై, భూములు చవుడుబారి ప్రజలు పెద్ద ఎత్తున చర్మ వ్యాధులు, క్యాన్సర్లు, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండెజబ్బులు, వ్యంధత్వంతో పాటు మానసిక వ్యాధులతో సమాజం అల్లకల్లోల మవుతోంది. హైదరాబాద్, సింగపూర్, వాషింగ్టన్, ఢిల్లీ వంటి నగరాల్లో ఎన్నడూ లేనంతగా ఈ రోజు స్త్రీలపై అత్యాచారాలు, ఉద్యోగాలిప్పిసామని, లైసెన్స్ విప్పిస్తామని, తెల్లారేసరికి ధనవంతులయ్యే మార్గాలు చూపిస్తామని చెప్పే వైట్‌కాలర్ మోసాలకు కేంద్రాలుగా వర్థిల్లుతున్నాయి. పరిశుభ్రమైనగాలి, వెలుతురు ఈ పట్టణాల్లో లేదంటే అతిశయోక్తి కాదు పరిశుభ్రమైన గాలి, రక్షిత నీరు కొనుక్కోవలసిన దుస్థితిలో ఈ నగరాలు కూనారిల్లుతున్నాయి. వీధికొక కార్పోరేట్ ఆసుపత్రి, వార్డుకొక మానసిక చికిత్సా కేంద్రం, ఆస్తులు, ఇళ్ళు అమ్ముకుని వైద్యం చేయించుకోవాల్సిన ప్రజలు, ప్రతీ నాలుగు రోడ్ల కూడలిలో వేలమంది ఉదయం ఉపాధికోసం నిలబడడం ఈ పట్టణాల్లో సర్వసాధారణం అన్నీ ధరలు పెరిగాయకనుక మాయిష్టం వచ్చినంత వసూలు చేస్తామనే ఆటోలు, టాక్సీలు, మందులషాపులు, బ్రాందీషాపులు, పబ్బులు, బార్లు, పోలీసులు, అధికార్లు ఒకటేమిటి అన్ని రకాల సామాజిక రుగ్మతలకు ఈ పట్టణాలే కేంద్రం. చీకటి పడిందంటే దారిదోపిడీలు, అత్యాచారాలు సర్వసాధారణం. ఖరీదైన కార్లలో, పెద్దపెద్ద బంగళాలలో నివసించే కొద్దివేల మందికోసం సేవచేయడానికి వేలాది మురికివాడలలో లక్షలాది మంది మనుషులు ఇదీ స్థూలంగా అభివృద్ధి ముఖచిత్రం.

ఈ ప్రణాళికలలతో వచ్చే ఈ పార్టీలన్ని దోచుకున్నదాన్ని పంచుకోవడానికి నాయకత్వం అధినాయకత్వం వారిచ్చే విప్‌లతో ప్రజాప్రతినిధుల సభలో బానిసలుగా బతికే వారిని ఎన్నుకోవడమా? లేక ప్రజలు వారికి కావాల్సిన అభివృద్ధి విధానాన్ని ప్రణాళికా బద్ధంగా పెట్టి దాన్ని ఆచరణలోకి తెచ్చే నికార్సైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడమా అనేది సమస్య?

ఈ ఎన్నికలలో మనవేం చేసినా పదేపదే వాళ్ళే ఎన్నికవుతారని నిరాశా నిస్పృహలు వదిలి సమాజం గురించి తీవ్రంగా ఆలోచిస్తే సుమారు 5000 మంది తలుచుకుంటే ఒక శాసన సభ్యుడి ఎన్నికను ప్రభావితం చేయగలం. అదే 50మంది తలచుకుంటే సర్పంచ్‌లను మార్చగలం. 20, 30 వేలమంది తలచుకుంటే పార్లమెంటు ముఖచిత్రం మారిపోతుంది. ఈ నేపథ్యంలో లోకవిద్యా ప్రపంచం ద్వారా లోకవిద్యా జనాందోళన కార్యక్రమాన్ని మరోసారి మీముందు పెడుతున్నాం.

- తమ తమ వృత్తులు చేసుకునే, తాము ఆనందంతో చేయగల్గిన పనిని అంటే కుమ్మరి, కమ్మరి, మేదరి, చర్మకారుడు, చేనేత వృత్తికారులు, మత్స్యకారులు, రజకులు, దర్జీలు, కంసాలులు మొదలైన వారంతా వారికిష్టమైన పని దొరకనంత కాలం ప్రభుత్వమే అదే పని కల్పించి ప్రభుత్వోద్యోగులతో సమానంగా పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలి. వారి ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయాలి.
- ఈ ప్రపంచంలో ప్రతీవ్యక్తికి తను చేసే పనిలో తరతరాలుగా వచ్చిన జ్ఞానంతో పాటు సులువుగా చేయడానికి తాను కూడా జ్ఞానాన్ని వృద్ధి చేసుకుంటాడని అలాగే వారిజ్ఞానం విశ్వవిద్యాలయాల్లో పనిచేసే ప్రొపెసర్లు, శాస్త్రజ్ఞులకు ఏమాత్రం తక్కువ గాదని గుర్తించి వారికి కూడా సమాన వేతనాలను చెల్లించాలి.
- ఇసుక, ఇనుప ఖనిజం, బొగ్గు, సహజవాయువు, పెట్రోలు, గాలితరంగాలు, విద్యుత్, అభ్రకం, బాక్సైట్ మొదలగు సహజ వనరులన్నింటిపై ప్రైవేట్ యజమాన్యాన్ని తొలగించి సామాజిక పరం చెయ్యాలి.
- సమస్త జ్ఞానాన్ని స్థానిక భాషలో ప్రజలందరికి అందుబాటులోకి తేవడానికి ప్రతిగ్రామంలో వృత్తి ఆధారిత పాఠశాలల స్థాపనకు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యాలి.
- భూగర్భజలాలు కలుషితం చేసే పరిశ్రమలన్నీ ఎత్తివేయాలి.
- దైనందిన జీవితంలో ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా రద్దు చేయాలి
- ప్రతీ గ్రామంలోనూ వున్న నీటివనరులను పునరుద్ధరించడంతో నీటిని చిన్న నీటివనరులలో నిల్వచేసే చిన్ననీటి తరహా ప్రాజెక్టులను ప్రతీ గ్రామంలో చేపట్టాలి.
- 100 కోట్ల నుండి 500 కోట్ల వరకు ఖర్చయ్యే 100 నుండి 500 పడకల సౌకర్య కలిగిన కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులను ప్రతిజిల్లా కేంద్రంలోను తగినన్ని మందులతో, వైద్యులతో నిర్మించి సకల జనులకు ఉచితంగా వైద్య, సౌకర్యం కల్గించాలి. కార్పొరేట్ ఆస్పత్రులకు ఎం.ఎల్.ఎ., ఎం.పి.లు, జడ్జీలు, అధికారులు, ఆరోగ్యవైద్యంకోసం చెల్లించడం పూర్తిగా నిలిపివేయాలి.
- ప్రతి మండల కేంద్రంలోనూ ఏదో ఒక సాంకేతిక విద్యా డిగ్రీ కళాశాలను ప్రభుత్వం నిర్మించాలి.
- ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రభుత్వ కార్యాలయాల్లో, విశ్వవిద్యాలయాల్లో, పాఠశాలల్లో ఖాళీలను వెనువెంటనే భర్తీ చేసి ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలి.

పై కోర్కెలతో పాటు ఎక్కడికక్కడ ప్రజలు తమ స్థానిక అవసరాల మేరకు సర్వాధికారాలతో ఆరోగ్యం, వైద్యం, విద్య, వ్యవసాయం, సాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి తదితర సంక్షేమ కార్యక్రమాలలో పర్యావేక్షణ అధికారం స్థానిక గ్రామ సభకు మాత్రమే ఉండాలి. మత్స్య, పాడి, వ్యవసాయ రంగాలకు చేయూతనిచ్చే ఫుడ్ కారిడార్లు స్థానిక ప్రజల పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి.

ప్రజలను నిర్వాసితులుగా చేసే ప్రాజెక్టులు, రసాయనిక కాలుష్యం, భార లోహాలు విడుదలచేసే పరిశ్రమలు, విదేశాల్లో నిషేధించిన, మూసివేసిన కాలుష్య కారక ప్రమాదకర పరిశ్రమలు మూసివేయాలి.

మహిళల ప్రాతినిధ్యం ప్రతీ ప్రజా సభలోనూ, 50 శాతం తగ్గకుండా ప్రభుత్వోద్యోగాలలో 50 శాతం తగ్గకుండా చేయగల్గిన రోజే మహిళా భద్రత ఏర్పడుతుంది.

చేనేత రంగంలో చీరలు, దోవతులు, లుంగీలు, టవళ్ళు, దుప్పట్లు మొదలైన 11 రకాలు రిజర్వ్ చేయబడినప్పటికీ ఆచరణలో ప్రతీరోజు ఉల్లంఘనలు జరుగుతూనే వున్నా చూస్తువున్న అధికారంలోని, ప్రభుత్వోద్యోగులను నిర్ధాక్షిణ్యంగా తొలగించివేయాలి. ప్రతి 10 కి.మీ.కు ఒక కేంద్రీయ/నవోదయ/సైనిక విద్యాలయాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.

- ప్రతీ గ్రామంలోనూ, పట్టణప్రాంతంలో ప్రతీ కూడలిలోనూ ఉచిత మరుగుదొడ్లను ఏర్పాటుచేసి పరిశుభ్రతను ప్రభుత్వం ఆచరణాత్మకంగా చూపాలి.
- మురికివాడలలో వున్న వారందరికి అక్కడే శాశ్వత ప్రాదిపదికన నిర్మాణాలు జరిపి పరిశుభ్ర వాతావరణంలో జీవించే హక్కు కల్పించాలి.

చివరగా స్థానిక ప్రజల అవసరాల మేరకు గ్రామ సభలో కూర్చొని ప్రతీ అభ్యర్థి తన ప్రణాళికకు వారి మద్దతును తీసుకునేలా వత్తిడి చేయాలి. తమ మద్దతులేని ప్రణాళికలను ఇతర ప్రణాళికలతో వచ్చిన అభ్యర్థులను ప్రజలు ఓడించాలి. అభ్యర్థులందరూ పనికి రానివాళ్ళయితే నోటా ప్రయోగించి అందర్నీ తిరస్కరిస్తే ఈ రాజకీయ పార్టీలు సత్యాన్ని చూడడానికి ఆకాశం నుండి భూమి మీదకు రావడానికి ప్రజలు దోహదపడాలి. లేకపోతే ఓటింగు రోజు ప్రభువుఅయిన సామాన్యుడు 5 సంవత్సరాలు యాచకుడుగాను, ఒకరోజు నౌకరుగా నటించే కలెక్టర్, రాజకీయనాయకులు, అధికారులు, పోలీసులు, 5 సంవత్సరాలు మనల్ని పీడించే పీడకులుగా ఉన్న ప్రస్తుత వ్యవస్థను మార్చడం సాధ్యం కాదు.

**- నారాయణరావుతో కె.జె.ఆర్**

**(కేజ్రివాల్ "స్వరాజ్" ఆధారంగా)**

**జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.**

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.

